## విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


మౌనిక(ఫైల్)

కాసిపేట, ఏప్రిల్ 17 : కాసిపేట మండలం లోని కోమటి చేనులో బెడ్డల మౌనిక (28) వివాహిత విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం మౌనిక తన ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్‌లో నీటిని చూసేందుకు ఇంటి ఇనుప రేకులపైకి ఎక్కింది. ఇంట్లోని విద్యుత్ వైర్లు తెగి రేకులకు, పైపులకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్త రాజేశ్, కుమారుడున్నారు. ఈ మేరకు తండ్రి జాడి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

బెల్లంపల్లిరూరల్, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్ లో ఫ్లాట్‌ఫాం నంబర్ 2 లో గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతదేహాన్ని గుర్తించినట్లు బెల్లంపల్లి రైల్వేహెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి బుధవారం తెలిపారు. మృతుడిని రామగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తించినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూషర్ట్, వైట్ లైన్స్ నీలం రంగు లుంగీ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానలో మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. కాజీపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, మృతుడి వివరాలు తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీసులను 8712658609, 9949859108 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## మహిళల బైక్ ర్యాలీ

ఎదులాపురం, ఏప్రిల్ 17: ఆదిలాబాద్‌లో బుధవారం శ్రీ రామనవమి సందర్భంగా ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ తీశారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677


ఆసిఫాబాద్ టౌన్ : సీతారాములను దర్శించుకున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రె దంపతులు


మందమర్రి: తలంబ్రాలతో వచ్చిన మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్


శ్రీరాంపూర్: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

# ఊరూరా శ్రీరామనవమి

- వైభవంగా సీతారాముల కల్యాణం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

**నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 17 :** శ్రీరామనవమి వేడుకలు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీలు, దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు, ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

**మంచిర్యాల జిల్లాలో..**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు చేశారు. జన్నారంలోని తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, దండేపల్లిలో గూడెం, లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, నస్పూర్, శ్రీరాంపూర్‌లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి దంపతులు పూజలు చేశారు.

జైపూర్, రామకృష్ణాపూర్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు, మందమర్రిలో కలెక్టర్ బదావత్ సంతోష్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సవితా దంపతులు, స్థానిక నాయకులు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.


ఆసిఫాబాద్ టౌన్ : పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


మంచిర్యాల ఏసీసీ : వేడుకల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు పూజలు చేశారు. కాసిపేటలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి పూజలు చేశారు. బుగ్గ రాజరాజేశ్వర దేవస్థానంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

ఆసిఫాబాద్‌లోని జన్కాపూర్ (జానకీపురం)గా పేరొందిన కోదండ రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కోవలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి సమర్పించారు. కలెక్టర్ వెంకటెశ్ ధోత్రె, అదనపు కలెక్టర్ దాసరి వేణు, దర్శించుకున్నారు. కాగజ్‌నగర్, దహెగాం, హత్తినిలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, బెజ్జూర్‌లో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు పాల్గొన్నారు.


జైపూర్ : వేంకటేశ్వరాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు


బెల్లంపల్లి : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్


దహెగాం : వేడుకల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

## నీళ్ల ట్యాంక్‌కు మొట్లు ఏర్పాటు చేయండి..


మెట్లు లేని నీళ్ల ట్యాంక్

భీమారం, ఏప్రిల్ 17 : ఇప్పల బోగుడ మంచిర్యాల – చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న నీళ్ల ట్యాంక్‌ను ఎక్కి శుభ్రం చేసేందుకు మెట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, సిబ్బంది కోరుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం భూ బాధితులు ట్యాంక్ ఎక్కి పలు మార్లు నిరసన తెలిపారు. దీంతో అప్పటి జైపూర్ ఏసీపీ వాటిని తొలగించారు. అప్పటి నుంచి ఆ ట్యాంక్ శుభ్రం చేసేందుకు నిచ్చెనతో పైకి ఎక్కి శుభ్రం చేస్తున్నారు. అదుపు తప్పి పడిపోతే ప్రాణాలు పోయే ప్రమాదముందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వతంగా మెట్లు(నిచ్చెన) ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు..


మరమ్మతు చేస్తున్న మెకానిక్..

నమస్తే ఎఫెక్ట్

మంచిర్యాల ఎంసీహెచ్‌లో సమస్యలపై నమస్తే తెలంగాణ' 'మాతా శిశు'కు తప్పని తిప్పలు శీర్షికన ప్రచురించిన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. హడావుడిగా ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో రోగుల బంధువులు హర్షం వ్యక్తం చేశారు. రోజు ఒక్కొక్కరికి నీటి కోసమే రూ. 100 నుంచి రూ. 200 ఖర్చు చేశామని, ఎట్టకేలకు మరమ్మతులు చేయించడంతో ఆ భారం తప్పినట్లైందని అక్కడికి వెళ్లిన 'నమస్తే'తో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఆర్వో ప్లాంట్ బాగు చేశాక నీటిని పట్టుకుంటున్న రోగి బంధువు

## లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో నామినేషన్ల ప్రక్రియ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోకసభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రె, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారి సురేశ్, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోకసభ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక బృందాలను నియమించామని, ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని అన్నారు. అదనంగా 79 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రె

# గంజాయి మత్తులో యువత..!

- ఇటీవల పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులపై ప్రిన్సిపాల్‌కు కాలనీ వాసుల ఫిర్యాదు
- బెల్లంపల్లిలో గంజాయి విక్రేతలతో పాటు ఓ ఇంట్లో ఆ మొక్కలు సాగు చేసిన వ్యక్తి అరెస్ట్



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల


ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసి వస్తున్న కాలనీవాసులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 17 : బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గంజాయి హబ్‌గా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ఇళ్ల ముందు విద్యార్థులు సిగరెట్లలో గంజాయి సేవిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెకిలి చేష్టలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల స్థానిక కాలనీ వాసులు ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడం బెల్లంపల్లిలో చర్చనీయాంశంగా మారింది. ఇళ్ల నుంచి తాము బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నామని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడం ఇక్కడి విద్యార్థులు గంజాయి మత్తులో ఏ స్థాయిలో జోగుతున్నారో అర్థమవుతున్నది.

**ఓపెన్ బార్‌గా.. పాత డంప్ యార్డ్**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పట్టణ శివారు ప్రాంతంలో ఉంది. అక్కడి నుంచి వంద మీటర్ల పరిధిలో పాత డంప్ యార్డు, నిర్మాణంలో ఉన్నా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఉంది. నిర్మానుష ప్రాంతం కావడంతో పట్టణంలోని పలు బస్తీల నుంచి యువత ఇక్కడికి వచ్చి మద్యం, గంజాయి సేవిస్తూ ఉంటారు. కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు వీరిని చూసి ఆకర్షితులై గంజాయి మత్తుకు అలవాటు పడ్డారని తెలుస్తున్నది. కళాశాల సమీపంలోనే దుకాణాల్లో సిగరెట్లు కొని అందులో గం జాయి పెట్టి పీల్చుతున్నారు. సిగరెట్ అలవాటు ఉన్న వారే ఈ మహమ్మారికి ఎక్కువగా అలవాటు పడ్డారనే తెలుస్తున్నది. ఇటీవల గంజాయి విక్రయిస్తున్న నిందితులను కళాశాలకు సమీపంలో ఉన్న కొత్త బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు పట్టుకోవడం, అదే విధంగా రెండు రోజుల క్రితం పట్టణంలోని కన్నాల బస్తీలో ఓ ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం.


**వాచ్‌మెన్ కనిపించడు ...సీసీకెమెరాలు పనిచేయవు**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రూమెంటేషన్, ఎలక్ట్రానిక్, ఇన్‌స్ట్రూమెంటేషన్ అండ్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. ప్రతి ఏడాదీ ప్రతి కోర్సులో 60 మంది విద్యార్థులు ప్రవేశం పొందుతారు. మొత్తం 540 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా కళాశాల ఆవరణలోనే వసతి గృహాలున్నాయి. గతేడాది గంజాయి సేవించారని సీనియర్ విద్యార్థులు ఆరుగురిని ప్రిన్సిపాల్ సస్పెండ్ చేశారు. తాజాగా నాలుగు రోజుల క్రితం రాత్రి సమయంలో గంజాయి మత్తులో ఇద్దరు విద్యార్థులు దాడి చేసుకున్న సంఘటన బయటకు రావడంతో వారిని హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. ఇటీవల కళాశాలలో ఓ విద్యార్థి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోగా లెక్చరర్లు మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందనే ఆరోపణలు వచ్చాయి. ఏడాది క్రితం ఓ విద్యార్థిని, విద్యార్థి మంచిర్యాలకు వెళ్లగా విద్యార్థిని సోదరుడు చూసి కళాశాల వచ్చి విచారణ చేయగా ఆ విద్యార్థిని కళాశాలలో లేకపోవడంతో కళాశాల లెక్చరర్లు అవాక్కయ్యారు. నైట్ వాచ్‌మెన్ ఉన్నా ప్రయోజనం లేకుండా ఉందన్నా ఆరోపణలు ఉన్నాయి. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతోనే బయటకు ఎవరూ వెళ్తున్నారో తెలియడం లేదు. రాత్రి పూట బయటకు వెళ్లినా విద్యార్థులపై చర్యలు తీసుకోకపోవడంతోనే అడ్డూ అదుపు లేకుండా తిరుగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**పెట్రోలింగ్ లేదు.. కౌన్సెలింగ్ లేదు**

కొంత కాలం నుంచి విద్యార్థులు గంజాయి మత్తులో పడుతున్నా సంబంధిత అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల క్రితం విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సందర్భంలో కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కళాశాల సమీపంలో రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్ లేకనే విద్యార్థులకు భయం లేకుండా పోయిందని, ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి తాగే వారిపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.


### గంజాయి విక్రేతలపై కేసులు నమోదు చేశాం..



బెల్లంపల్లి, ఏప్రిల్ 17 :స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గంజాయి రవాణా, విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకుని ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం. ఆరు నెలల్లో 15 కేసులు నమోదు చేశాం. కన్నాల బస్తీలో ఇంట్లోనే గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిని అరెస్టు చేశాం. పాలిటెక్నిక్ కళాశాల పరిసరాల వద్ద నిఘా పెట్టాం. ఇద్దరు కానిస్టేబుళ్లతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ తానే స్వయంగా కళాశాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వరకు ఉన్న దారిలో ద్విచక్రవాహనంతో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల సమయంలో సివిల్ డ్రెస్‌లో పెట్రోలింగ్ చేస్తున్నాను.

- దేవయ్య, బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో

### వెకిలి చేష్టలు చేసిన విద్యార్థులను సస్పెండ్ చేశాం...



గత ఏడాది సీనియర్ విద్యార్థులు పిచ్చిపిచ్చి చేష్టలతో వెకిలి వేషాలు వేస్తే ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేశాం. కళాశాల విద్యార్థులు ఎవరూ కూడా గంజాయి తీసుకోవడం లేదు. కళాశాల పరిసర ప్రాంతాల్లోనే ఇతరులు గంజాయి సేవిస్తున్నారు. సీసీ కెమెరాలు సరిగానే పని చేస్తున్నాయి. విద్యార్థులపై నిరంతంగా పర్యవేక్షణ చేస్తున్నాం. ఇప్పటికే పోలీసులకు సమాచారం అందించాం. పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించడం అరికట్టాలని కోరాం.

-పాలిటెక్నిక్ కళాశాల, ప్రిన్సిపాల్, రవీందర్‌రెడ్డి

## సింగరేణి

### పర్సనల్ మేనేజర్‌కు వినతి


పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్అండ్‌పీసీలు

రెబ్బెన, ఏప్రిల్ 17 : బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లో గల జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి ఎస్అండ్‌పీసీల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించినట్లు ఎస్అండ్‌పీసీ సిబ్బంది రమేశ్, రవీందర్, శ్రీనివాస్, మల్లేశ్, ఇనూస్, తపస్‌మండల్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి ఓడీ మాస్టర్, టీఏ, డీఏ విషయంలో అన్యాయం జరిగిందని, భవిషత్తులో ఇలాంటివి జరుగకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రాజమౌళి, చంద్రయ్య ఉన్నారు.

### నేడు ఆయుర్వేద శిబిరం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 17: ఈ నెల 18న నస్పూర్‌కాలనీలోని మనోరంజన్ సముదాయ్‌లో ఆయుర్వేద శిబిరం ఏర్పాటు చేసినట్లు శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కీళ్లు, నడుము నొప్పులు, తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు అందిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ ఆయుర్వేద శిబిరాన్ని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మికేతర కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూర్, ఏప్రిల్ 17 : రెబ్బెన, బెజ్జూర్ సబ్ స్టేషన్లలో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా మండలంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అంజల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చింతలమానేపల్లి మండలంలోని గూడెం, డబ్బా అనుబంధ గ్రామాల వారితో పాటు మండలంలోని ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో గల వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రేపు ఆదివాసీల చర్చా వేదిక

బెజ్జూర్, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో ఈ నెల 19వ తేదీన ఆదివాసీలు వారి సమస్యలపై చర్చా వేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల జిల్లా నాయకుడు సోయం చిన్నయ్య, నాయకులు మెస్రం రాజారా, ఎలాది నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్చల్లో ముఖ్య అతిథులుగా గోండ్వానా గోండు మహాసభ జాతీయ నాయకుడు సిడాం అర్జు మాస్టర్, గోండ్వానా రాయిసెంటర్ చర్చా గోష్టి జిల్లా నాయకుడు మోతీరాం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసుల సమస్యల పరిష్కారానికి మండలంలోని నార్ పటేల్, సార్ పటేల్, ఘాటియల్, దేవారి నాయకులతో పాటు ఆదివాసీ గ్రామ పెద్దలు, తదితర వర్గాల వారు ఈ చర్చల్లో పాల్గొనాలని వారు కోరారు.

## గురుకుల విద్యార్థుల ప్రతిభ


రెబ్బెన గురుకుల విద్యార్థులతో అధికారులు

రెబ్బెన, ఏప్రిల్ 17 : రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించిన గైడ్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. గత నెల నిర్వహించిన పరీక్షలో తొమ్మిదో తరగతి చదువుతున్న దొంతుల హర్షిత (సామాన్య శాస్త్రం విభాగంలో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంక్), ఏడో తరగతి చదువుతున్న వైరాగడే శైలజ(సామాన్య శాస్త్రం విభాగంలో జిల్లా స్థాయిలో 1వ ర్యాంక్), ఆరో తరగతి చదువుతున్న డొంగ్లా అలేఖ్య(ఇంగ్లిష్ విభాగంలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్), ఆరో తరగతి చదువుతున్న నాగులపల్లి నైనిక(గణిత విభాగంలో జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్) సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్‌సీవో స్వరూపరాణి, డీసీవో బాలరాజు, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య మోడల్స్ అందజేసి అభినందించారు.

## మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 17 : మంచిర్యాల జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ పాట్రాన్ మెంబర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద 300 మందికి చల్లటి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కే భాస్కర్‌రెడ్డి, సెక్రెటరీ చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, శంకర్ వర్మ, సత్యనారాయణ రెడ్డి, మావిచ మోనిక, శైలజ, తిరుపతి, మణికంఠ, రాజేశ్ పాల్గొన్నారు.


మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

## ఐపీఎల్ బెట్టింగ్ కాస్తున్న పది మంది అరెస్ట్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 17: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ కాస్తున్న పది యువకులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం మంచిర్యాల మున్సిపాలిటీ సమీపంలోని వాటర్‌ట్యాంక్ ఏరియాలో పలువురు యువకులు ఐపీఎల్ బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం రాగా ఎస్ఐ, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ పది మంది యువకులను అరెస్ట్ చేసి వారిపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి సందర్భంగా కౌటగూడ గ్రామానికి చెందిన గెడం లక్ష్మణ్ బుధవారం ఇంట్లో దీపం వెలిగించాడు. ప్రమాదవశాత్తు దీపం నుంచి మంటలు అంటుకోవడంతో ఒక్కసారిగా గ్యాస్‌సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, రూ.15లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు లక్ష్మణ్ వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. కాగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నేత కేశవరావు మాదిగ పరామర్శించారు.